క్లుప్తంగా

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కూచిపూడి(మొవ్వ): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకొని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా కొనసాగాలని గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి సూచించారు. కూచిపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సంయుక్తంగా ఉత్తర దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ యామిని, కూచిపూడి సెక్టార్ సూపర్‌వైజర్ ఏఎస్ కల్యాణి, నాయకులు కొండవీటి అమరబాలేశ్వరరావు, కార్యకర్తలు బి.వీరకుమారి, టి సుజ్ఞానం, ఆర్.నాగమణి, ఎం.సరస్వతి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయండి



మొవ్వ: స్థానిక జగనన్న కాలనీలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 245 ఇళ్లలో 83 గృహాలు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని బిల్లులు పొందాలని మండల ప్రత్యేక అధికారి కుముదినిసింగ్ సూచించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జగనన్న కాలనీలోని లబ్ధిదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు సైతం గృహ నిర్మాణానికి రుణాలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆ ఇంటి అవసరాలను బట్టి ఒక్కొక్కరికి రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు సాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే మస్తాన్, ఎంపీడీఓ డి.సుహాసిని, హౌసింగ్ ఏఈ గరికపాటి వంశీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఏ పాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. 92 మంది పుణ్య దంపతులు ఈ హోమం పూజా కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి కటాక్షం పట్టణ ప్రజలపై ఉండాలని ఈ హోమం నిర్వహించామని పేర్కొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి మెండు



కురుమద్దాలి(మొవ్వ): వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధితో విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా పొంద వచ్చని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ రాణి పేర్కొన్నారు. బుధవారం పామర్రు మండలం కురుమద్దాలిలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులను 10 రోజులపాటు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ రాణి విచ్చేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అలాగే కిశోర బాలికలకు బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ కల్యాణి, సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశం బహిష్కరణ



మండవల్లి: పంచాయతీల అభివృద్ధి సూచికపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి వర్క్‌షాపు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి అధికారుల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి మాత్రమే హాజరయ్యారు. దీంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు.

ఈ నిరీక్షణ ఎన్నాళ్లు బాబూ?

- యూరియా కోసం అన్నదాతల పడిగాపులు
- ఎండలో నిల్చోలేక క్యూలో చెప్పులు పెట్టిన వైనం



మొవ్వపాలెంలో యూరియా కోసం క్యూలో ఉంచిన చెప్పులు

మొవ్వపాలెంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మొవ్వపాలెం(మొవ్వ): మొవ్వ మండలంలో యూరియా కోసం రైతులకు పడిగాపులు తప్పటంలేదు. కావాల్సినంత యూరియా పీఏసీఎస్‌లకు రాకపోవటంతో అన్నదాతలు గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి. మొవ్వ మండలంలోని అయ్యంకి, మొవ్వపాలెం, చినముత్తేవి, పెదముత్తేవి, కోసూరు గ్రామాల్లోని పీఏసీఎస్‌ల ద్వారా, కాజ, పెదపూడి, నిడుమోలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 110 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసింది. అయినా అవసరమైన మేర యూరియా సరఫరా చేయకపోవడంతో అయ్యంకి, మొవ్వపాలెం తదితర గ్రామాల్లో క్యూలో రైతులు బారులు తీరడం కన్పించింది.

ఉదయం ఆరున్నరకే క్యూలో..

మొవ్వపాలెం పీఏసీఎస్ వద్ద రైతులు గంటల తరబడి క్యూలో వేచి ఉండలేక తమ చెప్పులను క్యూలో పెట్టి గంటల తరబడి నిరీక్షించారు. ఆ సొసైటీ పరిధిలోని వేములమడ, మొవ్వపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు ఉదయం ఆరున్నర గంటలకే తరలివచ్చి క్యూలో ఐదారు గంటలు వేచిఉన్నారు. దీనికి తోడు భానుడు ప్రతాపాన్ని చూపటంతో రైతులు ఎండలో నిలబడలేక ఆ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ఏ విధమైన తోపులాటలు లేకుండా ఒకరికొకరు కూడా పలుక్కొని తమ పాదరక్షలు ద్వారా క్యూ ఏర్పాటు చేశారు. అధికారులు ఉదయం 10 గంటల ప్రాంతంలో తరలివచ్చి టోకెన్ సిస్టం ద్వారా పంపిణీ చేస్తామనటంతో చెప్పులను తోసేసి టోకెన్ల కోసం ఎగబడటంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు కొందరు 'ఈ తిప్పలు ఎన్నాళ్లు బాబూ' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో కూచిపూడి పోలీసులు రంగ ప్రవేశం చేసి టోకెన్లను పంపిణీ చేశారు. మొవ్వపాలెం పీఏసీఎస్‌కు 10 మెట్రిక్ టన్నుల యూరియా రావటం రైతులకు యూరియా అందే పరిస్థితి లేకపోవటంతో మండల పరిధిలోని పెదపూడి, నిడుమోలు తదితర విక్రయ కేంద్రాలకు స్లిప్పులను రాసి ఇచ్చినట్లు సమాచారం. ఏడీఏ సూరపనేని శ్యామల, ఏఓ బి.సురేష్‌బాబు నాయక్, వీపీఏలు, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో యూరియా పంపిణీ కొనసాగింది.

పెదపారుపూడిలోనూ బారులు తీరిన రైతులు



వానపాముల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిలబడిన మహిళలు

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల, వెంట్రప్రగడ, యలమర్రు, పాములపాడు, పెదపారుపూడి పీఏసీఎస్‌లవద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఉదయం నుంచే యూరియా సొసైటీల ద్వారా ఇవ్వటంతో అధిక సంఖ్యలో రైతులు తరలి వచ్చారు. వానపాముల పీఏసీఎస్‌లో మహిళలు సైతం వచ్చి క్యూలో బారులు తీరారు. గంటల తరబడి నిలబడితే పట్టాదారు పుస్తకానికి ఒక బస్తా మాత్రమే ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

పెదమద్దాలి(మొవ్వ): యూరియా సరఫరాపై రైతులు ఎలాంటి ఆందోళన చెంద వద్దని, ప్రతి రైతుకూ సరిపడా యూరియా అందిస్తామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం పామర్రు మండలంలోని పెదమద్దాలి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. యూరియా పంపిణీ స్థితిగతులపై రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎకరానికి కనీసం బస్తా యూరియాను అందించాలని ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ సొసైటీ కింద ఉన్న పెదమద్దాలి, బల్లిపర్రు, కురుమద్దాలి, ఉరుటూరు వంటి నాలుగు గ్రామాలకు ఇప్పటి వరకు 159 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశామని, ఇంకా 40 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టామని తెలిపారు. రెండు రోజుల్లో ప్రతిపాదించిన యూరియాను సొసైటీకి తప్పనిసరిగా సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు ఆర్డీఓ బీఎస్ హేలా షారోన్, తహసీల్దార్ రవికాంత్, ఏఓ శివ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సక్రమంగా అందుతుందా.. లేదా?

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ బంగారురాజు



వెంట్రప్రగడ పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ డీఎస్పీ

వెంట్రప్రగడ(పెదపారుపూడి): రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా యూరియా సక్రమంగా అందుతుందా లేదా అని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ బంగారురాజు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వెంట్రప్రగడ, వానపాముల, పెదపారుపూడి పీఏసీఎస్‌లో బుధవారం తనిఖీ చేశారు. వెంట్రప్రగడ పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడారు. రైతులు మాట్లాడుతూ యూరియా వస్తుందిగానీ ఒకటి లేదా రెండు బస్తాలు ఇస్తున్నారని తెలిపారు. 10 ఎకరాలు కౌలు చేస్తుంటే ఇచ్చే యూరియా బస్తాలు సరిపోవటం లేదని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. వానపాముల పీఏసీఎస్ వద్ద కూడా డీఎస్పీ రైతులతో మాట్లాడారు. పెదపారుపూడి పీఏసీఎస్ వద్ద యూరియా నిల్వలను పరిశీలించారు. యూరియా కోసం వచ్చే రైతులకు తాగు నీరు, నీడ కోసం షామియానా ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ త్రినాథ ఆంజనేయరావు, పీఏసీఎస్ కార్యదర్శులు నారాయణ, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళులు



ఐలమ్మకు నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

గుడివాడ టౌన్: సామాజిక వర్గ అభివృద్ధిలో చాకలి ఐలమ్మ చేసిన కృషి మరువలేనిదని రజక అభ్యుదయ సంఘం నాయకులు అన్నారు. బుధవారం స్థానిక నీలామహల్ రోడ్డులోని రజక అభ్యుదయ సంఘం కార్యాలయంలో పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆ సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజ అభివృద్ధి, సామాజిక అభివృద్ధి కోసం ఐలమ్మ చేసిన పోరాటాలను నాయకులు స్మరించుకున్నారు. తెలంగాణా ఉద్యమకారిణిగా, వీర వనితగా తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత అని, సామాజిక ఆధునిక పరిణామాలకు ఆమె నాంది పలికిన స్త్రీ అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రభు, జగన్మోహనరావు, ఎం. నాగరాజు, ఆర్. వేణు, దేవేంద్రుడు, ఆర్. షణ్ముఖ, వి. ఆదినారాయణ, శ్రీనివాస్, జి. ప్రకాష్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కైలే

పామర్రు(మొవ్వ): తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు కైలే అనిల్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



గుడ్లవల్లేరు: మండలంలోని వడ్లమన్నాడు, కౌతవరం ప్రభుత్వ హైస్కూళ్లలో 530 మంది విద్యార్థులకు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, స్థానిక క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరుకు చెందిన మూల్పూరి నాగేశ్వరరావు(65) మృతి చెందారు. మృతుడు గతంలో చెప్పిన కోరిక మేరకు కుటుంబసభ్యులు బుధవారం నేత్రదానం చేశారు. గుంటూరు శంకర నేత్రాలయ వైద్యులు నాగేశ్వరరావు నాగేశ్వరరావు భౌతిక ఖాయం నుంచి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, స్థానిక క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్ల పాల్గొన్నారు.

సత్యదేవునికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామికి బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు. ఛాత్రమాస దీక్షలో భాగంగా భక్తులు ఈ ప్రత్యేక పూజలను చేపట్టారని వేద పండితులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు, పవన్‌కుమార్ తెలిపారు.

అలంకారప్రాయంగా వంట షెడ్డు

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో నిర్మించిన వంట షెడ్డు అలంకార ప్రాయంగా ఉంది. ఈ షెడ్డుకు మన బడి మన భవిష్యత్తు కింద ప్రస్తుత సర్కార్ నిధులు కేటాయించకపోవటంతో ఈ వంట షెడ్డుకు పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తవ్వక అరకొరగా ఉంది. దీనితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి చేసే వంటను ఆరు బయటే నిర్వహిస్తున్న దుస్థితి ఏర్పడింది. ఈ షెడ్డుకు నిధులు కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యలను తల్లిదండ్రులతో పంచుకోవాలి



కమలామృతాన్ని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

గుడ్లవల్లేరు: విద్యార్థులు తమ సమస్యలను తల్లిదండ్రులతో పంచుకోవాలని గుడివాడ జూనియర్ సివిల్ కోర్టు అడ్వొకేట్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ జి.ఆర్.కమలామృతం పేర్కొన్నారు. వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఐపీఏ గుడ్లవల్లేరు లోకల్ బ్రాంచ్ సంయుక్తంగా ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జి.ఆర్.కమలామృతం హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మొబైల్ ఫోన్స్ ఎక్కువ వినియోగించటం వలన వ్యక్తిగత సంబంధాలు తగ్గిపోయాయని ఆమె అన్నారు. చివరికి స్నేహితులతో కూడా తమ మానసిక స్థితిని పంచుకోనందున ఆత్మహత్యలు ఎక్కువయ్యాయన్నారు. మన జీవితం పుట్టుకను ఎంచుకునే హక్కు మనకు ఎలా లేదో.. బలవన్మరణం పొందే హక్కు కూడా మనకు లేదని పేర్కొన్నారు. సోషల్ మీడియా ప్రలోభాలకు లొంగకుండా తమ చుట్టూ ఉన్న వ్యక్తులతో సత్సంబంధాలను ఏర్పరచుకోవాలన్నారు. కుటుంబాలకు విలువనివ్వాలని సూచించారు. ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.సాయిధాత్రి, డాక్టర్ ఎస్‌కే అమీనాబి, డాక్టర్ పి.రవిష, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి.బాలకృష్ణ, బి.సత్య శ్రీ పాల్గొన్నారు.

గుంతలో ఇరుక్కుపోయిన వాహనాలు



భారీ గుంతలతో వాహనదారుల ఇక్కట్లు

నందివాడ: రోడ్లపై గుంతలు ప్రయాణికులను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. అధికారులు వచ్చి చూసిపోవడం తప్ప వాటికి మరమ్మతులు చేయించిన దాఖలాలు లేవు. ఆ గుంతల్లో వర్షం నీరు చేరి బురదమయంగా మారడంతో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం కురిసిన తేలికపాటి వర్షానికి ఇలపర్రు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలోని గుంతలో బొలెరో వ్యాన్, రెండు ఆటోలు ఇరుక్కుపోయాయి. స్థానికులు ట్రాక్టర్‌తో వాటిని బయటకు తీశారు. అధ్వానంగా ఉన్న రహదారుల్లో నిత్యం ఇలాంటి ఘటనలే జరుగుతున్నాయని స్థానికులు వాపోయారు. వాహన ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విగ్రహాలకు సీసీ కెమెరాల ఏర్పాటు



ఆలపాడు సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గం కలిదిండి గ్రామంలో వంగవీటి రంగా విగ్రహాలకు పేడ పూసిన ఘటన నేపథ్యంలో పోలీసులు విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా కైకలూరు మండలం ఆలపాడు సెంటర్‌లో నందమూరి తారకరామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి రంగా తదితర విగ్రహాల వద్ద దాతల సాయంతో సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్‌ఐ వి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో రాజకీయ నాయకుల విగ్రహాల వద్ద దాతల సాయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయండి



పాఠశాల తరగతి గదులను పరిశీలిస్తున్న పంకజ్‌కుమార్

కైకలూరు: జిల్లాలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులను కూల్చివేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.పంకజ్‌కుమార్ తెలిపారు. తరగతి గదుల పరిశీలనలో భాగంగా కైకలూరు మండలం భుజబలపట్నం ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గంలో 18 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 41 తరగతి గదులు విద్యార్థులకు సురక్షితం కాదని గుర్తించామన్నారు. దీంతో కలెక్టర్ ఆ గదులను ధ్వంసం చేయాలని ఆదేశించారన్నారు. వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఇంజినీర్లతో పరిశీలించి సౌండ్‌నెస్ ధ్రువ పత్రాలను తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్ రీత్యా గుర్తించిన వాటిని కూల్చి వేయాలని ఆదేశిస్తామన్నారు. భుజబలపట్నానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సీతారామరాజు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలపై డీఎల్‌పీఓ అమ్మాజి బుధవారం విచారణ చేపట్టారు. ఈ పంచాయతీలో 2013 నుంచి 2024 వరకు జరిగిన కార్యకలాపాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ గ్రామానికి చెందిన దూబ చంద్రకాంత్, అల్లాభక్షు, రెడ్డి వెంకన్న గతంలో ఫిర్యాదులు చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికీ ఐదు సార్లు విచారణ చేయగా అసంపూర్తిగా ముగిసింది. గత నెల 13న డీఎల్‌డీఓ లక్ష్మి విచారణ చేపట్టినప్పటికీ సాంకేతిక కారణాల వలన మధ్యలోనే నిలిపివేశారు. తిరిగి బుధవారం ఆమె విచారణ నిర్వహించగా అప్పటి కార్యదర్శులు శ్యాంసుందర్, రమేష్‌తో పాటు ప్రస్తుత సర్పంచ్ అల్లు సుశీల విచారణకు హాజరయ్యారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తామని దీనిపై ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇదే సందర్భంలో స్థానిక అలేఖ్య వెంచర్ నివాసితులు తాము పడుతున్న అవస్థల గురించి డీఎల్‌పీఓకు తెలిపారు. వెంచర్‌లో మంచినీటి కుళాయి కనెక్షన్‌కు సంబంధించి ఒక్కో కనెక్షన్‌కు రూ.13 వేల నుంచి రూ.17వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపించారు. ఈ సమస్యలను పరిశీలించి నివారించేందుకు విచారణ బృందాన్ని పంపిస్తామని డీఎల్‌పీఓ తెలిపారు.

గురువులకు సముచిత స్థానం

కైకలూరు: సమాజంలో గురువులకు సముచిత స్థానం ఉందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో 15 మంది మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, ఒకరు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి బుధవారం సన్మానం చేశారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కామినేని సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొమ్మనబోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్షీణించిన పారిశుద్ధ్యం



మండవల్లిలో రోడ్డు పక్కన వేసిన చెత్త



పెరికెగూడెం రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై చెత్త, మురుగు నీటితో అధ్వానంగా మారాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అంటు వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండవల్లి, పెరికెగూడెం, కానుకొల్లు తదితర గ్రామాలు రోడ్డు వెంబడి చెత్త కుప్పలతో దుర్వాసన వెదజల్లుతోంది. సమస్యను పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. రోడ్ల వెంబడి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడాలని స్థానికులు కోరుతున్నారు.

'సంకల్పం'తో కిశోర బాలికలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మేరీ

గుడ్లవల్లేరు: సంకల్పం కార్యక్రమంతో కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.మేరీ అన్నారు. బుధవారం కౌతవరం, అంగలూరులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సంకల్పం పేరిట కిశోర బాలికలకు పోషకాహారం, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన సదస్సు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెయ్యేరు శివారు రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఎయిడ్స్, క్షయ నియంత్రణపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధి కె.చంద్రావతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి బారిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త కె.కృష్ణకుమారి, ఆశావర్కర్ కె.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ముదినేపల్లి ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నారాయణపురం, ప్రొద్దుటూరు, ఊటుకూరు, వైవాక గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మల నరికివేత పనులు చేపడతామని పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ప్రకటన